08-02-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఒక్క తండ్రికి మాత్రమే అపారమైన మహిమ ఉంది, తండ్రికి ఉన్నటువంటి మహిమ ఇంకెవ్వరికీ కూడా ఉండజాలదు"

ప్రశ్న:- పిల్లలైన మీకు ఈ చదువు పట్ల చాలా-చాలా గౌరవముండాలి - ఎందుకు?

జవాబు:- ఎందుకంటే మొత్తం కల్పంలో ఒక్కసారి మాత్రమే, తండ్రి పరంధామం నుండి చదివించేందుకు వస్తారు. మనుష్యులు చదువుకునేందుకు భారత్ నుండి విదేశాలకు వెళ్తారు, ఇది పెద్ద విషయమేమీ కాదు. ఇక్కడైతే చదివించేవారు ఎంత దూరం నుండి వస్తారు. కనుక పిల్లలకు చదువు పట్ల చాలా గౌరవముండాలి. కొద్దిగా కష్టమైనా కూడా ఫర్వాలేదు. మీ స్కూల్ వీధి-వీధిలోనూ తయారవ్వాలి, లేదంటే ఇంతమంది ఎలా చదువుకుంటారు! బాబా పరిచయమైతే అందరికీ తప్పకుండా లభించాలి.

ఓంశాంతి. మధురాతి-మధురమైన పిల్లలు అడుగుతారు, వీరు ఎవరు అని. వీరేమీ సాధువు, సన్యాసి, మనిషి అయితే కాదు. వీరు వేరు. మనుష్యులనైతే వెంటనే గుర్తిస్తారు, ఫలానా సాధువు, సన్యాసి అని, పేరు తీసుకొని ఫలానా మహాత్మ అని అంటారు. ఇది కేవలం పిల్లలకు తెలుసు. బిడ్డ అని ఆత్మను అంటారు. ఆత్మకే అంతా తెలుసు, శరీరానికి కాదు. వీరు ఫలానా అని ఆత్మనే అంటుంది. ఇంద్రియాల ద్వారా తెలుసుకుంటుంది. ఒకవేళ ఆత్మ లేకపోతే, ఈ కనులు పని చేయలేవు. అంతా ఆత్మకే తెలుసు.

ఇప్పుడు పిల్లలైన మిమ్మల్ని ఆత్మాభిమానులుగా తయారుచేయడం జరుగుతుంది. ఆత్మ అంటుంది, ఈ ఇంద్రియాల ద్వారా ఫలానా కర్తవ్యం చేస్తాను అని. వాస్తవానికి ఆత్మను మేల్ (పురుష్) అని అనడం జరుగుతుంది, ఫిమేల్ (స్త్రీ) అని కాదు. పురుష్ ఎందుకంటే మనమందరం పరస్పరంలో సోదరులము. ఇప్పుడు మీరు కొత్త విషయాలను వింటారు. ఎవరు వచ్చారు? వారికి తమదంటూ మనిషి రూపం లేదు. అనంతమైన తండ్రి శివబాబా, వారు వీరి ద్వారా అర్థం చేయిస్తారని మీకు తెలుసు. వీరు ఫలానా సన్యాసి అని, వీరి ఆత్మ మాట్లాడుతుందని కాదు. అలా కాదు, మనుష్యులకు అటెన్షన్ అంతా నామ రూపాల పట్ల వెళ్తుంది. మీ బుద్ధి అర్థం చేసుకుంటుంది, వీరు మన అనంతమైన తండ్రి, వీరు శరీరం ద్వారా మనకు తమ వారసత్వాన్ని ఇస్తారు, రాజయోగాన్ని నేర్పిస్తారు అని. వీరు అందరికీ తండ్రి. వీరు సర్వుల పతిత-పావనుడు, కేవలం మనుష్యులకే కాదు, 5 తత్వాలకు కూడా. సర్వుల సద్గతి చేసేవారు ఉన్నతోన్నతమైన తండ్రి. సృష్టిలో మహిమ చేసేందుకు యోగ్యులుగా ఉన్నారంటే, అది ఒక్క తండ్రి మాత్రమే, ఇంకెవ్వరూ లేరు. బ్రహ్మ, విష్ణు, శంకరుల యొక్క మహిమను కూడా చేయలేరు. వారి జన్మ దినాన్ని జరుపుకుని ఏం చేస్తారు! లక్ష్మీ-నారాయణులు, ఎవరి కంబైండ్ రూపమైతే విష్ణువునో - ఇప్పుడు వారు ఎక్కడున్నారు? లక్ష్మీ-నారాయణులు పునర్జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ ఇప్పుడు అంతిమ జన్మలో ఉన్నారు. మళ్ళీ శివబాబా యోగ్యులుగా తయారుచేస్తున్నారు. సర్వుల సద్గతిదాత వారొక్కరే. మహిమ కూడా ఒక్కరిదే. ఆ పతిత-పావనుడు లేని కారణంగా ఈ సృష్టి పరిస్థితి ఏమైపోయిందో చూడండి. రాధే-కృష్ణులు ఎక్కడున్నారు అని కృష్ణుని భక్తులను అడగండి, అప్పుడు వారు, సర్వవ్యాపి అని అంటారు. రాధే యొక్క పూజారులు, రాధయే రాధ అని అంటారు. హనుమంతుని పూజారులు, ఎక్కడ చూసినా హనుమంతుడే హనుమంతుడు అని అంటారు. కానీ అలా కాదు. తండ్రి తమ మహిమనైతే తాము చేసుకోరు, తమ పాత్రతోనే నిరూపణ చేస్తారు. ఇంకెవ్వరి మహిమ గాయనం చేయడం జరగదు. లక్ష్మీ-నారాయణులే రాజ్యం చేస్తారు, బాల్యంలో వారు రాధే-కృష్ణులు. అదైతే ప్రారబ్ధము. కావున వారి మహిమ ఏం చేస్తారు. బ్రహ్మకు కూడా మహిమ లేదు, విష్ణువుకు కూడా ఎలాంటి మహిమ లేదు. మహిమ అయితే ఒక్కరికి మాత్రమే ఉంది. వారినే పతిత-పావనుడు అని అంటారు. ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు, విష్ణువు ఎవరు! విష్ణువుకు సూక్ష్మవతనంలో స్వదర్శన చక్రాన్ని ఎందుకు చూపిస్తారు? అని. మనుష్యులకైతే ఎక్కువ భుజాలు ఉండవు. ప్రవృత్తి మార్గాన్ని ఋజువు చేయడానికి సూక్ష్మవతనంలో కూడా నాలుగు భుజాలు చూపించడం జరిగింది.

బాబా అంటారు, మధురమైన పిల్లలూ - మేము 84 జన్మలను ఎలా తీసుకుంటాము అనేది ఇప్పుడు మీరు తెలుసుకున్నారు. మీ గృహస్థ వ్యవహారం పవిత్రంగా ఉండేది. మందిరాలకు వెళ్ళి పాడుతారు కదా, సర్వ గుణ సంపన్నులు... నీవే తల్లివి తండ్రివి... అని, ఇప్పుడు ఈ మహిమ ఇక రాంగ్ అయిపోతుంది. ఈ మహిమ కేవలం ఒక్కరిదే. దేవతలది కాదు. మహిమంతా ఏదైతే ఉందో, అది ఒక్కరిదే. వారే పరమపిత పరమ ఆత్మ. పరమ తండ్రి,

పరమ టీచర్, పరమ సద్గురువు, అకాల్ అని అంటారు కదా. వారిని స్మృతి చేస్తారు, వారే అకాల్ మూర్త్. శివబాబాను ఎద్దుపై చూపిస్తారు. వారేమో మళ్ళీ అకాల సింహాసనాన్ని చూపిస్తారు. ఇప్పుడు, శివబాబా ఎవరు అనేదైతే ఎవ్వరికీ తెలియదు. మందిరాలలో ఏదైతే పెడతారో, అది వారి అంశము. వారైతే జ్ఞానసాగరుడు, పతిత-పావనుడు. వారికైతే మనిషి తనువు కావాలి కదా. ఈ బ్రహ్మనే వారి సింహాసనం అని పిల్లలైన మీకు తెలుసు. ధర్మ స్థాపకులకు ఏం మహిమ ఉంది. వారు వచ్చి కేవలం ధర్మ స్థాపన చేస్తారు. వారేమీ జీవన్ముక్తినివ్వరు. మనుష్యులు, మోక్షం లభించాలి, ఇక రానే రాకూడదు అని అంటారు. ఆ ధర్మ స్థాపకులైతే తమ ధర్మంవారిని కిందకు తీసుకువచ్చేందుకు నిమిత్తులుగా అవుతారు. వారైతే వచ్చి తమ ధర్మ స్థాపన చేయాల్సి ఉంటుంది. ఇది డ్రామాలోని పాత్ర. ఎవరెవరైతే వస్తారో, వారు పునర్జన్మలు తీసుకోవాల్సిందే, స్థాపన అయితే తండ్రి చేస్తారు, వారు అందరి పతిత-పావనుడు, ఇంకెవ్వరూ పావనంగా తయారుచేయరు. మిగిలనవారైతే వస్తారు, తమ-తమ పాత్రలను అభినయిస్తారు. సతో, రజో, తమోలలోకి రావాల్సిందే, వారు ధర్మ స్థాపన చేసారు, అంతే. ఏ శిక్షణలనైతే ఇచ్చారో, తర్వాత వాటి శాస్త్రాలు తయారయ్యాయి. ఎవరైతే ధర్మ స్థాపన చేస్తారో, వారు మళ్ళీ తప్పకుండా పాలన చేయాల్సి ఉంటుంది. తిరిగి ఎవరూ వెళ్ళరు. ఈ సమయంలో అందరూ రకరకాల నామ-రూపాలతో, ఇక్కడ పతిత ప్రపంచంలో ఉన్నారు. మొదటి నంబరులోని లక్ష్మీ-నారాయణులను చూడండి. వారు కూడా ఇప్పుడు ఇక్కడ ఉన్నారు. ప్రజాపిత బ్రహ్మ ద్వారా బ్రాహ్మణులను రచిస్తారు. తర్వాత వీరు వెళ్ళి రాధే-కృష్ణులుగా అవుతారు. ఎప్పటివరకైతే శివబాబా రారో, అప్పటివరకు ఎవరూ పావనంగా అవ్వలేరు. బలిహారము ఆ ఒక్కరిదే. వారికే మహిమ ఉంది. శివాయ నమః, నీవే తల్లివి తండ్రివి... అని అంటారు కూడా. అందరూ స్మృతి చేస్తారు. అందరికన్నా ఎక్కువ మహిమ ఆ తండ్రిదే. ఓ గాడ్ ఫాదర్, అని పిలుస్తారు కూడా. తండ్రినే పిలుస్తారు. ఈ నాటకం తయారై ఉంది. ఎప్పుడైతే సృష్టి పాతదిగా అవుతుందో, అప్పుడు తండ్రి వస్తారు. మూలవతనము, సూక్ష్మవతనము, స్థూలవతనము, మూడు లోకాల జ్ఞానాన్ని ఇస్తారు. జ్ఞానం ఒక్కసారే లభిస్తుంది. వారిని జ్ఞానసాగరుడు అని అంటారు. ఇకపోతే, ఈ సూర్య-చంద్రులు మొదలైనవి అయితే అనంతమైన రంగస్థలానికి ప్రకాశాన్ని ఇచ్చేటువంటి దీపాలు. అది రాత్రి, ఇది పగలు, ఇవి రంగస్థలం యొక్క దీపాలు. సూర్య దేవతాయ నమః అని అంటారని కాదు. అలా కాదు, దేవతలైతే బ్రహ్మ, విష్ణు, శంకరులు. మూలవతనము నుండి ఆత్మలు ఏవైనా ఇక్కడకు వస్తే, నేరుగా గర్భంలోకి వెళ్తాయి, సూక్ష్మవతనంలోకి వెళ్ళవు. నేరుగా సత్యయుగంలో గర్భ మహలులోకి వస్తాయి. అక్కడైతే పాప కర్మలేవీ జరగవు. ఇక్కడ పాపాలు చేస్తారు, అందుకే ఆర్తనాదాలు చేస్తారు. ధర్మరాజ్, మమ్మల్ని బయటకు తీయండి, ఇక మేము మళ్ళీ పాపాలు చేయము అని అంటారు. బయటకు రావడంతో మళ్ళీ పాపాలు చేయడం మొదలుపెడతారు. అక్కడిది అక్కడే ఉండిపోతుంది... ఇది కూడా డ్రామాలో ఉంది. భారత్ కు అందరికన్నా పెద్ద శత్రువు రావణుడే. ద్వాపరం నుండి రావణ రాజ్యం మొదలవుతుంది. ద్వాపరంలోనే దేవీ-దేవతలు వామ మార్గంలోకి వెళ్తారు. వారి మందిరాలు ఉన్నాయి. పూరీలో చూడండి, ఎలాంటి మందిరం తయారుచేయబడింది. లోపల జగన్నాథుని మూర్తి ఉంది మరియు బయట దేవతలవి చాలా అశుద్ధమైన చిత్రాలు ఉన్నాయి. ఇలాంటి-ఇలాంటి చిత్రాలు మందిరాలలో ఉండకూడదు. మీరైతే ఇప్పుడు శ్రీమతంపై శ్రేష్ఠంగా తయారయ్యేటువంటి పురుషార్థం చేస్తున్నారు. సత్యయుగం ఆదిలో లక్ష్మీ-నారాయణులు శ్రేష్ఠంగా ఉన్నారు కదా. వారు ఈ శ్రేష్ఠ పదవిని ఎలా పొందారు. ఇప్పుడు మీరు మళ్ళీ చదువుకుంటున్నారు. తండ్రి అంటారు, నేను కల్ప-కల్పము, కల్పం యొక్క సంగమయుగంలో మళ్ళీ వస్తాను. వస్తూనే ఉంటాను. మళ్ళీ పిల్లలైన మీకు రాజయోగాన్ని నేర్పిస్తాను. తర్వాత సతో, రజో, తమోలలోకి రావాలి. మీలో ఎవరైతే మొట్టమొదట వస్తారో, వారు 84 జన్మలను అనుభవించాల్సి ఉంటుంది. అందరూ అనుభవించరు. 84 లక్షలు అయితే ఉండవు. మనుష్యులకు ఎవరు ఏం చెప్పినా, అది సత్యము, సత్యము అని అంటూ ఉంటారు. ఒకవేళ 84 లక్షల జన్మలు ఉన్నట్లయితే, కల్పం యొక్క ఆయువు ఎక్కువ ఉండాలి. తండ్రి అంటారు, 84 జన్మలు ఉన్నాయి, అవి కూడా దేవీ-దేవతలకే ఉంటాయి. అచ్ఛా, మరి ఇస్లాములు, బౌద్ధులు, క్రిస్టియన్లు మొదలైనవారు ఎన్ని జన్మలు తీసుకుంటూ ఉండవచ్చు. లెక్క ఉంది కదా. రావడమైతే చాలా మంది వస్తారు, కొమ్మలు-రెమ్మలు ఉన్నాయి.

మీకు మొత్తం సృష్టి యొక్క ఆదిమధ్యాంతాలు తెలుసు. భారత్ యే మొదటి నంబరులో విశ్వానికి యజమానిగా ఉండేది, ఇంకే ధర్మము ఉండేదే కాదు. ఇప్పుడు ఆ దేవీ-దేవతా ధర్మం యొక్క పాదం లేదు. దాని శాస్త్రం కూడా లేదు. ఈ గీత మొదలైన శాస్త్రాలు తర్వాత తయారవుతాయి. మీరు ఏ సత్యమైన గీతనైతే తయారుచేస్తారో, అది ఉంటుందని కాదు. ఆ గీతనే మళ్ళీ వెలువడుతుంది. భక్తి మార్గం కోసమైతే అన్నీ అవసరం కదా. పిల్లలకు బ్రహ్మ ద్వారా అర్థం చేయిస్తారు. ఇప్పుడు తప్పకుండా బ్రహ్మ ద్వారా భగవంతుని ప్రాప్తి కలుగుతుంది. బాబా అంటారు, ఇదంతా భక్తి మార్గము. నేను ఎప్పుడైతే ఇక్కడకు, భారత్ లోకి వస్తానో, అప్పుడే నా ప్రాప్తి కలుగుతుంది. భారత్ యే అవినాశీ ఖండము. భారత్ యే ఎంత షావుకారుగా ఉండేది. సోమనాథ మందిరం ఎంత పెద్దది! అంతా దోచుకొని

తీసుకువెళ్ళిపోయారు. బిర్లా వద్ద చాలా ధనం ఉంది కనుక ఎంత పెద్ద మందిరాలను నిర్మించారు. తండ్రి ఎంత మంచి రీతిలో అర్థం చేయిస్తారు! ఇది ఇంకెవ్వరూ అర్థం చేయించలేరు. జ్ఞానసాగరుడైన తండ్రి ఎప్పుడైతే పిల్లలకు అర్థం చేయిస్తారో, అప్పుడు పిల్లలు అర్థం చేసుకుంటారు. ఇది చదివించేవారు ఎవరు? వీరేమీ సన్యాసి కాదు. వీరి పేరే శివ్. ఆత్మలందరూ వీరి పిల్లలు. వారి శరీరాల పేర్లు మారుతూ ఉంటాయి. వీరికి ఒకటే పేరే ఉంది. నాకు ఇంకే పేరు లేదు అని అంటారు. మీరైతే జనన-మరణాలలోకి వస్తారు, దేహాభిమానులుగా కూడా అవుతారు. నేను ఎప్పుడూ దేహాభిమానిగా అవ్వను. తండ్రి ఉన్నదే సదా కోసం దేహీ-అభిమాని ఎందుకంటే పునర్జన్మలలోకి రారు. శివరాత్రిని జరుపుకుంటారు కదా. కానీ రాత్రి అర్థాన్ని ఏమీ అర్థం చేసుకోలేరు. ఎన్ని పొరపాట్లు ఉన్నాయి. ఇప్పుడిది రాత్రి, మళ్ళీ పగలుగా అవ్వనున్నది. ఇప్పుడు కల్పము యొక్క అంతము అనగా రాత్రి పూర్తి అయ్యింది. సత్య-త్రేతా యుగాలు పగలు. ద్వాపర కలియుగాలు రాత్రి. నేను సంగమయుగంలోనే రావాల్సి ఉంటుంది. ఇవి అనంతమైన రాత్రింబవళ్ళు. భగవానువాచ - ఈ వేళ ముఖ్యమైనదని అర్థం చేయిస్తారు. కానీ శివబాబా యొక్క వేళను తెలుసుకోలేరు. వారెప్పుడు వస్తారో ఏమైనా తెలుస్తుందా. కనుక ఇవి అనంతమైన రాత్రి మరియు పగలు, దీనిని కల్పము యొక్క సంగమము అని అంటారు. ఒకవేళ జన్మదినాన్ని జరుపుకున్నా ఒక్కరిదే జరుపుకుంటారు. శివబాబా వస్తారు, మళ్ళీ వెళ్ళిపోతారు. వారికి జన్మా లేదు మరియు మరణము లేదు. బాబా వెళ్ళిపోయారు అని అంటారు, ఇది ఆట. తండ్రి కూర్చుని అర్థం చేయిస్తారు, తన దారిన తాను వెళ్తున్న బ్రాహ్మణుడు చిక్కుకుపోయారు అని అంటూ ఉంటారు కూడా. ఈ బాబాకు ఇంతకుముందు ఏమైనా తెలుసా. అకస్మాత్తుగా ప్రవేశించడం జరిగింది. ముందుగానే ఏమైనా తెలుస్తుందా. ఇది బాబా పని అని నెమ్మది-నెమ్మదిగా తెలుస్తుంది. ఈ జ్ఞాన యజ్ఞం నుండి వినాశ జ్వాల ప్రజ్వలితం అవ్వనున్నది. అనంతమైన యజ్ఞంలో అనంతమైన సామాగ్రి స్వాహా అవ్వనున్నది. ఇది అనంతమైన తండ్రి యొక్క యజ్ఞము. దీని తర్వాత ఇంకే యజ్ఞము రచించడం జరగదు. భక్తి మార్గమే సమాప్తమైపోతుంది. ఈ జ్ఞానాన్ని బుద్ధిలో ఉంచుకోవాలి. చదువును చదువుకోవడానికి రావాల్సి ఉంటుంది. కొద్దిగా కష్టం కలుగుతుంది. మనుష్యులు చదువుకునేందుకు, భారత్ నుండి లండన్ కు, అమెరికాకు కూడా వెళ్తారు. మరి ఇది అసలు ఏమిటి? తండ్రి అంటారు, నేను కల్ప-కల్పము, ప్రతి కల్పం యొక్క సంగమయుగంలో, పరంధామం నుండి చదివించడానికి వస్తాను, కనుక పిల్లలకు ఎంత గౌరవం ఉండాలి. మున్ముందు మీ స్కూళ్ళు వీధి-వీధిలోనూ తయారవుతాయి. లేదంటే అందరూ ఎలా చదువుకుంటారు. బాబా పరిచయం అందరికీ లభించాలి. తండ్రిని తప్పకుండా తెలుసుకుంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. శ్రీమతంపై సదా శ్రేష్ఠంగా తయారయ్యే పురుషార్థం చేయాలి. చదువు విషయంలో సాకులు చెప్పకూడదు. చదువును తప్పకుండా చదువుకోవాలి.

2. ఎలాగైతే ఆదిలో పవిత్ర గృహస్థ ఆశ్రమం ఉండేదో, అలాగే ఇప్పుడు తమ పవిత్ర గృహస్థ ఆశ్రమాన్ని తయారుచేసుకోవాలి. బలిహారం ఒక్క తండ్రిదే, వారి గుణాలనే గానం చేయాలి.

వరదానము:- ప్రతి ఖజానాను స్వయం పట్ల మరియు సర్వుల పట్ల కార్యంలో ఉపయోగించే అనుభవీ మూర్త భవ

ఇముడ్చుకునే శక్తిని ధారణ చేసి, సర్వ ఖజానాలతో సంపన్నులుగా అయి, వాటిని స్వయం యొక్క కార్యంలో మరియు ఇతరుల యొక్క సేవా కార్యాలలో ఉపయోగించండి. ఖజానాలను ఉపయోగించడంతో అనుభవీ మూర్తులుగా అవుతూ ఉంటారు. వినడము, ఇముడ్చుకోవడము మరియు సమయానికి కార్యంలో ఉపయోగించడము - ఈ విధి ద్వారా అనుభవం యొక్క అథారిటీగా అవ్వగలరు. ఎలాగైతే వినడము బాగా అనిపిస్తుందో, పాయింట్లు చాలా మంచిగా, శక్తిశాలిగా ఉన్నాయని అనిపిస్తుందో, అలా వాటిని కార్యంలో ఉపయోగించి శక్తిశాలిగా విజయులుగా అవ్వండి, అప్పుడు అనుభవీ మూర్తులు అని అంటారు.

స్లోగన్:- ఎవరైతే నిందించేవారికి కూడా గుణాల మాలను ధరింపజేస్తారో - వారిని గుణవంతులు అని అంటారు.